# మానవుడూ - దానవుడూ

సంధ్య చీకట్లు నలువేపులా వ్యాపిస్తున్నాయి. అద్దెకు తీసుకున్న సూటు, బూటులో అందంగా తయారైన జగన్నాధం మరొకమారు, అద్దం చేతిలోకి తీసుకుని ముఖం చూచుకున్నాడు. నొక్కులుగా వున్న క్రాపులోని నొక్కులు, ఒకటి రెండు, ముఖంమీదకు జారేలా, క్రాపు సరిచేసుకున్నాడు. హుషారుగా యీల వేసుకుంటూ బయల్దేరాడు! "ఒరేయ్ జగ్గూ! త్వరగా యిల్లు చేరుకో నాయనా!" తల్లి హెచ్చరికలోని భావం బాగా అర్థమయింది.

"సర్లే!" విసుక్కుంటూ వీధిలోకి వచ్చేశాడు. ఠీవిగా అంగలేస్తూ గబ గబ నడుస్తున్నాడే గానీ, అలవాటయిన మనసు మారాం మొదలెట్టింది. కళ్ళు పరిసరాల్ని పరికిస్తున్నాయి.

ఎవరి జేబుల్లోనూ పెద్ద పర్సులు కన్పించటం లేదు! కనిపించినా, వాళ్ళెవరూ జన సమ్మర్దంలో నడవటం లేదు! ఊరికే కాళ్లు అరిగేలా తిరగటమే అయ్యింది! విసుగ్గా నడుస్తున్న జగన్నాధానికి విద్యుద్దీపాల వెలుగుకూడా దుర్భరంగానే ఉంది!

"వెధవ లైట్లు, ఏం కొంప మునిగి పోయిందనో తెగ వెలుగుతున్నాయి! హఠాత్తుగా వూళ్లో కరెంటు చెడినా బాగుణ్ణు!"

కసిగా మనసుపెట్టే శాపనార్థాలకు లైట్లు ఆరిపోనూ లేదు! అతని ఆవేదన తీరనూ లేదు! చీకటి సందులోకి కాళ్లు తిరిగాయి! చెడిపోయిన వీధిలైటు స్తంభానికి జేరబడి నిల్చున్నాడు. దూరాన కన్పిస్తున్న బంగళా, లైట్ల కాంతిలో ఇంద్రభవనంలా వుంది!

"హుఁ! లక్షలు, లక్షలు డబ్బు సంపాదించి పెద్ద పెద్ద బంగళాల్లో బొజ్జలు పెంచుక కూర్చుంటారు!" అనవసరంగా ఆ కనిపిస్తున్న బంగళా తాలూకు మనుషుల్ని తిట్టుకున్నా, కసి తీరటం లేదు.

హఠాత్తుగా అతని కళ్ళు జిగేల్ మన్నాయ్. బంగళా ముందునుంచి ఆరేడేళ్ళ పాప గబగబ నడిచివస్తోంది చీకట్లో. తలమీదున్న పాపిడిబొట్టూ, మెళ్ళో నెక్లెసూ, చేతి గాజులూ, వంకీలు ధగధగ మెరిసి పోతున్నాయి నక్షత్రాల్లా! పట్టు పరికిణీ జరజరలాడ్తూ బాగా దగ్గరగా వచ్చేసింది!

హఠాత్తుగా జగన్నాథం గుండె దడదడ కొట్టుకోవటం ప్రారంభించింది. తలలో మెరుపు మెరిసింది! ఆ పాపను పట్టుకుని ఆ నాలుగు నగలూ లాక్కుని పారిపోతే! ఏ రవ్వలో లాగా ఉన్నాయి. హీనపక్షం పదివేలయినా చేస్తాయి. చాలు! ఏ బొంబాయో పోయి రాజాలా కాలు మీద కాలేసుక బ్రతకొచ్చు! మనస్సు ఒక్క క్షణంలో భవిష్యత్తును రంగులలో అందంగా చిత్రించేసింది! అంతే ఒక్క వుదుటున పాపను పట్టుకున్నాడు జగన్నాథం.

క్షణకాలం అనుకోని ఈ పరిస్థితికి తడబడింది పాప. "ఎవరు నువ్వు ?" గద్దిస్తూ అడిగింది ! కూత ఘనంగానే ఉంది! "నేను... నేను" తడబడ్డాడు జగన్నాథం. తమ చుట్టూ చీకటి గానే ఉందిగానీ సందుచివర అక్కడక్కడా మనుష్యులు తిరుగుతూనే ఉన్నారు.

పాప భయపడి కేకలువేస్తే ? మళ్ళీ శ్రీకృష్ణజన్మస్థానం చూడాల్సి వస్తుంది! బుర్ర బహు చురుగ్గా పనిచేయటం మొదలెట్టిందతనికి. మెల్లిగా రాని నవ్వు తెప్పించుకుంటూ పాపను చేతిమీది కెత్తుకున్నాడు.

"నా వెంట వస్తావా పాపా ? తమాషాలు చూపిస్తాను నీకు." అన్నాడు.

"ఓ వస్తా! నాకు అమ్మమీద కోపం వచ్చేసింది...నువ్వు మామయ్యవా ? మగవాళ్ళందరూ మామయ్యలని చెప్పిందిలే మా అమ్మ !" పాప చెబుతోంది.

"ఊఁ..." అన్యమనస్కంగా తలాడిస్తూ గబగబ మరో సందులో నుంచి పెద్దవీధిలోకి వచ్చేశాడు. ఎవరికీ అనుమానం కలక్కుండా, సాధ్యమైనంత తేలికగా సహజంగా నడవటానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ కళ్ళు మాత్రం తన కార్యక్రమానికనువైన ప్రదేశం కోసం గాలిస్తున్నాయి.

"మామయ్యా ! అదుగో ఆ బెలూనులు చూడు ఎంత తమాషాగా వున్నాయో ?" అంటూంది పాప హుషారుగా.

"ఊఁ"

"అదుగో ఆ మేడమీద జెండా ఎగురుతోంది మామయ్యా!"

"అవును".

"పుట్టింరోజు పండగంటే ఏమిటి మామయ్యా?"

"ఏమో!" చటుక్కున నాలిక్కరుచుకున్నాడు తన సమాధానానికి తనే నొచ్చుకుంటూ. "కాకున్నా ఈపిల్లకి వాగుడెక్కువలావుంది!" మనసులోనే విసుక్కున్నాడు జగన్నాధం.

"అరె నీకూ తెలీదూ? నాకూ తెలీదులే. అమ్మ చెప్పింది సాయంత్రం. 'రాధా! నీ పుట్టింరోజు ఇవాళా! మరి న్ని సొమ్ములు పెట్టుకోవాలీ ... ... ఎక్కడికీ వెళ్లొద్దూ' అని మామయ్యా! నా కోపం వచ్చేసింది. నే నాడుకోనక్కర్లా? మెల్లిగా వచ్చేశాను..."

పాప చెబుతున్న దానిలో, పాప పేరు 'రాధ' అనేది మినహా మరేమీ తల కెక్కలేదు...

ఎక్కడా మనుష్య సంచారంలేదు. బాగా చీకటి నలుమూలలా రాజ్యం చేస్తోంది. రోడ్డుకు చాలా దూరం వచ్చేశారు. చుట్టూవున్న చెట్లు గుబురుగుబురుగా, తనకు నచ్చినట్లున్నాయి.

"ఇదేంటి మామయ్యా! ఇక్కడింత చీకటిగా వుందేం? లైట్లు లేవా ఇక్కడ? నాకు భయమేస్తుంది మామయ్యా!" పాప నలువేపులా చూస్తుంది భయం భయంగా.

ఏదో శక్తి ఆవహించింది, దట్టంగావున్న చీకటిలానే. అది శరీరమూ, మనస్సు అంతా నిండిపోయింది. చేతిమీది పాపను దించాడు.

"ఉష్ అరవకు!" చేతి గాజులు లాగాడు...అవి రావందే?

పాప పకపక నవ్వింది! "అవి అలా రావు మామయ్యా! నేలాగిపారేస్తానని అమ్మ కొత్తరకంగా చేయించిందట. ఇదుగో ఈ మరలుతీసి ఊడతియ్యాలి. అబ్బ, ఈ మర నాకు రావటం లేదు, నువ్వేతియ్యి మామయ్యా!" పాప తన బుల్లిచేతులు కళ్ళ ముందుంచింది.

మనస్సెందుకో గతుక్కుమంది! పాప పెద్దగా ఏడ్చి గోలచేస్తే, నోరుకట్టెయ్యటానికి కర్చిఫ్ సిద్ధంగా వుంచుకున్నాడు తను... ఎందుకనో పాప మాటలతో తన ఆలోచన తలక్రిందులయ్యింది...నగలు తీసుకోటానికి దండోపాయం వాడనక్కర్లేదని తెలిపోయింది. గాజులు నాలుగూ చేతిలోకి వచ్చేసాయి.

"పాపా! దొంగలెవరేనా ఉంటారిక్కడ. నీ నెక్లెస్ ఇస్తావా? దాచేస్తాను?" రహస్యంగా అడిగాడు.

"దొంగలుంటారా మామయ్యా? అయితే నువ్వే దాచెయ్! అసలీ నెక్లెస్ ఏమీ బాగలేదుకదూ? ఛ. ఒద్దంటుంటే వేసిందమ్మ."

పాప ప్రవర్త నెందుకో వింతగానూ, హృదయంలో ఏదో అలజడినీ కల్గిస్తోంది.

"మామయ్యా! నాకు భయమేస్తోంది. ఇంటికి పోదాం!" పాప కంఠస్వరంలో మార్పు ఏడుపును సూచిస్తోంది.

పాపిడిబొట్టుకూడా నేర్పుగా తీసేశాడు. నగలన్నీ జేబులో కుక్కుకున్నాడు.

"ఇక వెళ్దాంమామయ్యా! అమ్మ ఏడుస్తుంది నేను కనుపించకుంటే..." పాప మెల్లగా రాగం మొదలెట్టింది.

వినిపించుకోకుండా గబగబ అడుగులు ముందుకు వేసాడు...

"మా...మ...య్యా!" వెనకనుంచి కంపితస్వరం అడుగు సాగనివ్వలే దెందుకో...

"భ...యం." వెక్కిళ్ళు విన్పించాయి జగన్నాథానికి. వెనుదిరిగి చూడకుండా ఉండలేక పోయాడు ... తిరిగి చూచి స్తంభించి పోయాడెందుకో! చుట్టూ గాఢాంధకారం. పైన నక్షత్రాలు పరుచుకున్న నింగి, క్రింద దయ్యాల్లా విరగబడివున్న చెట్లతో నేల! మధ్యలో చిక్కని చీకటి! చిన్నారి చేతులు చాపుతూ ఆరేళ్ళపాప! భీతిల్లి ఏడుస్తోంది!

ఎవరూ లేని ఆ ప్రదేశంలో ఎవరో తనను గదుముతున్నారు. రోపల్నుంచి తిడుతున్నారు. అసహ్యించుకుంటున్నారు......ఎవరు? ఎవరు? ... ఎవరోకాదు తన అంతరాత్మే!

జగన్నాధం నిలువునా వణికిపోయాడు......ఏదో పైశాచికశక్తి గబుక్కున తనలోనుంచి దూకి పరుగెత్తి నట్లయ్యింది. ఏం చేస్తున్నాడు తను ? ఏం చెయ్యబోతున్నాడు ? తలతిరిగినట్లయ్యింది క్షణంలో. ఆ తమోమయ భీభత్స ప్రకృతి తనకే భయాన్ని కలిగిస్తోంది.

"మామయ్యా! వెళ్తున్నావా? అమ్మో..." పాప వెక్కిళ్ళతో మాటలు సరిగా రావటంలేదు.

పరుగున వెళ్ళాడు జగన్నాధం. క్షణంలో ఏదో పొర తొలగిపోయింది తనలో! పాపను హృదయానికి హత్తు కున్నాడు......భయంతో కంపించిపోతూ, కళ్ళనీళ్ళు కాల్వలు కడుతూంటే, సొమ్మసిలినట్లు, జగన్నాధాన్ని చుట్టేసుకుంది పాప! తనకూ కళ్ళనీళ్లు పొంగి వచ్చాయి! వాత్సల్యం వెల్లువికింది. వీపు నిమిరాడు. తల నిమిరాడు.

"ఎందుకు పాపా? రాధా! భయమెందుకమ్మా? నేనున్నానుగా?" అనునయించాడు. పాప వెక్కిళ్ళు తగ్గాయి.

కళ్ళనీళ్లు తుడిచాడు. "ఇదుగో సొమ్ములు పెట్టుకో. ఇంటికిపోదాం పద!" కృతనిశ్చయుడై నాడు.

"ఒద్దు మామయ్యా! నీ దగ్గరే వుంచుకో. ఇక్కడ దొంగలుంటారన్నావుగా? ఇంటికిపోదాం మామయ్యా!" పాప ఒక్కొక్కమాట అతని పైశాచిక ఆలోచనల్ని తుత్తునియలు చేసివేస్తోంది.

పాపను మళ్ళీ చేతిమీది కెత్తుకున్నాడు జగన్నాథం. క్షణకాలం క్రితం తను తలపెట్టిన రాక్షసకృత్యానికి, వెక్కిరింపుగా చెట్లు గలగలలాడాయి. బయట రోడ్డుమీద నడుస్తుంటే, ఎంతో తేలికగావుందిప్పుడు. ఈసారి విద్యుద్దీపాల వెలుగు దుర్భరంగా లేదుకూడాను!

పాప చెబుతోంది: "మామయ్యా! నువ్వు వెళ్ళిపోతావని భయమేసింది. దొంగలొచ్చి నన్నుకొట్టరూ? నేను చచ్చిపోనూ?" గుండెలు పిండినట్లయ్యిందతనికి.

"ఛ, ఛ అలా అనకూడదమ్మా! నే నెక్కడికెళ్తానూ? నిన్ను తమాషా చేద్దామని దాక్కున్నా నంతే!" తలపెట్టిన కుకర్మను కప్పిపెడుతూ, ఆ అమాయిక బాలిక భయం తీర్చటానికి అబద్ధమాడుతుంటే, పశ్చాత్తాపంతో పునీతమైన మనసు మెల్లిగా నవ్వుతోంది.

"నేను కూడా నీలాగే తమాషా చేశాను మామయ్యా ఓసారి. అమ్మకక్కనిపించకుండా ఇనప్పెట్టె చాటున దాక్కున్నాను. అమ్మ, నాన్న, నౌకర్లూ అంతా భలేగా వెతికారులే! అమ్మ ఏడ్చింది. నాన్న ఏడ్చారు. అప్పుడు అమ్మ ఏడుస్తుంటే నాకూ ఏడుపొచ్చింది. బయటికొచ్చేశాను. ఇక చూడు మామయ్యా! అమ్మ యెట్లా నవ్విందనుకున్నావ్? ఎన్ని ముద్దులు పెట్టుకుందనీ? నాన్న చాక్లెట్లిచ్చారు. బిస్కెట్లు పెట్టారు. నన్ను ఎత్తుకున్నారు. ఇప్పుడు చూడు మామయ్యా, మనం యింటి కెళ్లేసరికి అమ్మ నా కోసం ఏడుస్తూ వుంటుంది. నన్ను చూచి నవ్వుతుంది. బలే తమాషాగా ఉంటుందిలే!" పాప హుషారుగా చెబుతోంది.

తన చిన్నారి మాటలతో, పాప ఎంత దృశ్యాన్నో మనస్సుముం దుంచింది! జగన్నాథం మనసులో కల్లోలం రేగింది. తల్లి కోసం ఆ పా పెంత క్షోభించేది? ఆ చీకటిలో భీతిల్లి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయేది. మళ్ళీ స్పృహవచ్చి దిక్కులు చూచి భయంతో మరణించేది! వెతికి వెతికి కనిపించక, ఆ తల్లీ తండ్రీ పొందే ఆవేదన కంతంవుందా? జీవితాంతం తమ పాపను తల్చుకుని వారు కుమిలిపోయేవారు! ఆ తలిదండ్రుల, ఆ అమాయకపు పాపల, క్షోభ, ఆ ఆవేదాగ్ని తనను వెంటాడేవి! ఎక్కడున్నా, ఆ దావాగ్నికీలలు తనను భస్మంచేసివుండేవి! అబ్బ! ఎంతపాపాని కొడిగట్టాడు తను? తనచేతుల్తో నగలన్నీ తీసిచ్చి, తనను నమ్మివచ్చిన ఆ అమాయికపు బాలికను పరోక్షంగానేనా అంత మొందించి వుండేవాడు! ఛీ! తనూ ఒక మనిషేనా? కాదు దానవుడు తను!

కానీ ఎలాగో ఆ రాక్షసత్వాన్నుంచి తన్నెవరో తప్పించారు! భగవాన్ నీకు శతకోటి నమస్కారాలు తండ్రీ!

కృతజ్ఞతలు భగవంతుడికి చెప్పుకుంటూండగానే సందు మలుపులోకి వచ్చేశారు.

పాపను దించాడు జగన్నాథం.

"ఇక వెళ్ళు పాపా! అదుగో ఇల్లొచ్చింది. ఇదుగో నీ సొమ్ములు. అమ్మకిస్తావుకదూ?" పాపను ముద్దు పెట్టుకున్నాడు.

"ఉహు! నువ్వుకూడా రా మామయ్యా!" పాప మారాం చేస్తోంది. గత్యంతరం తోచలేదు. కానీ జరిగిందానికి,

ఏ విధంగా సంజాయిషీ చెప్పుకొని బయటపడాలి? పాప అంతా చెబితే? ఏవేవో సందేహాలు తలెత్తుతున్నా యతనిలో. కానీ పాప లొాక్కెళుతోంది. కాదనటానికి అవకాశంకూడా లేక పోయింది.

"అమ్మా!" పాప పిలుపు పరిసరాల్లో మారుమ్రోగింది.

ఆ తల్లి పరుగెత్తుకు వచ్చింది. తండ్రి వెనకాలేవున్నాడు. నౌకర్లముఖాలు వికసించాయి. ఇంట్లో ఒక్కసారిగా వేయి జ్యోతులు వెలిగినట్లయ్యింది. జగన్నాథం బొమ్మలా నిల్చున్నాడు చూస్తూ.

ఆ తల్లి పాపనంతా తడుముకుంటోంది. ఏడుస్తోంది. నవ్వుతోంది. ఉన్మాదినిలా అయిపోతోంది. "పాపా! తల్లీ! నా రాధా! వచ్చావమ్మా? ఎక్కడికెళ్ళావ్ తల్లీ? నన్నొదిలి పెట్టి ఎందుకెళ్ళావ్ పాపా? ఆ నగలకోసం ఎవరేం చేసారోనని భయపడిపోయామమ్మా! ఏవీ నగలు? పోనీ! పోతే పోయాయిలే పాపిష్టినగలు! నువ్వు మాకు దక్కావ్. అంతేచాలు!" ఆ తల్లి ఆనందంలో, అనురాగంలో, భీతిలో తొణికిసలాడ్తున్న బాధ, వాత్సల్యం, జగన్నాథాన్ని నిలువునా ఛేదించి వేస్తున్నాయి.

అతడు పాపతండ్రి - విశ్వనాథం - గబగబ జగన్నాథం దగ్గరగా వచ్చాడు.

"వీధులన్నీ వెతికించాం. ఇక పోలీసు రిపోర్టిద్దామనుకుంటున్నాం. దేవుడిలా మీరు పాపను తెచ్చారు. ఎక్కడుందండీ పాప? ఎలా తెచ్చారు? అసలేంజరిగింది? ప్చ్- ఏం జరిగితేనేం?

కథా నిలయం 1158 శ్రీకాకుళం

మా పాపను మాకు చూపించారు. నా భార్య ప్రాణాలూ, నా కుటుంబాన్నీ నిలిపారు. మీ మేలు జన్మజన్మలకూ మర్చిపోలేం..."

జగన్నాధం కొయ్యబారిపోయాడు. తన వేషభాషల్ని చూచి వారేవేవో ఊహాగానాలు చేస్తున్నారు. తనొక పెద్ద మనిషిగా, మానవుడిగా భావిస్తున్నారు......కానీ తన వాస్తవిక రూపం......కొద్ది నిముషాల క్రితం తాను చెయ్యతల్చుకున్న పనిని గురించి వాళ్ళకేమీ తెలియదు!

"మామయ్య చాలా మంచివాడమ్మా! దొంగలొస్తారని నా సొమ్ములన్నీ దాచాడుకూడానమ్మా! బలే తమాషాలు చూపించాడమ్మా నాకు..." తల్లిఒళ్ళో కూర్చుని పాప చెబుతున్న మాటలతో గుండె ఆగినట్లయ్యింది జగన్నాధానికి.

"రాండి లోపలికి రాండి...ఈ రోజు మా ఇంట్లో భోజనం చెయ్యాలి మీరు...మా పాప పుట్టినదినం పండగ మామూలుగా సంతోషంగా అంతమవుతుందని మేమనుకోలేదు. కనీసం మీ ఋణం ఇలానేనా కొంత తీర్చుకోనీండి..."

"అవునన్నయ్యా! ఇది మీఇల్లే ననుకోండి. రాండి లోపలికి!" ఆవిడ - పార్వతికూడా - ఆహ్వానించింది.

నిర్విణ్ణుడై చూస్తున్న జగన్నాధానికి ఆ దంపతులు మామూలు మానవుల్లా కన్పించటంలేదు. ఇద్దరిలో అణువణువునా కృతజ్ఞత, ఆదరణా నిండివున్నాయి.

[library stamp]

విశ్వనాథం బలవంతాన్ని త్రోసిపుచ్చలేక పోయాడు. సోఫాలో కూర్చున్నాడు. టీపాయ్‌మీద రకరకాల పళ్ళు, ఫలహారాలూ తెచ్చిపెట్టాడు విశ్వనాథం.

"ఇవి కొద్దిగా పుచ్చుకోండి. ఈ లోపల మా పార్వతి భోజనానికి సిద్ధంచేస్తుంది!" విశ్వనాథం, తనూ దగ్గరగా కూర్చున్నారు. హృదయం విజృంభించింది! ఈ మర్యాదలకు తను అర్హుడా? వాళ్ళెంత నిర్మల హృదయులు! తనదెంత కుటిల బుద్ధి! తలెత్తిచూశాడు. ఎదురుగా గోడకువున్న అద్దంలోని తన ప్రతిబింబం వెక్కిరిస్తోంది.

"చూశావా? నీ చెడుకే ఇంత ఆదరణ లభిస్తోంది! నీ రాక్షసత్వానికే ఇంత గౌరవం వచ్చింది! ఇంకా వాళ్ళను మోసగిస్తావా? ఇంతటి స్వచ్ఛత నీ ప్రక్కనుండగా కూడా నీలో మాలిన్యాన్ని శుభ్రపరుచుకోవాలనే తలంపు నీకులేదా?"

ఉలిక్కిపడ్డాడు జగన్నాథం.

"సందేహిస్తున్నారేం? తీసుకోండి ..ఇంతకూ మీ పేరు అడగటం మర్చిపోయా?" విశ్వనాథం మృదుత్వాన్నిక భరించ లేక పోతున్నాడు... "విశ్వనాథంగారూ! ఇంతగా మీరు గౌరవించాల్సిన అర్హత నాకులేదు..." జగన్నాథం తల వంచుక చెబుతున్నాడు.

"అదేమిటండీ అలా అంటారూ?" ఏదో చెప్పబోతున్న విశ్వనాథానికి అడ్డొచ్చాడు జగన్నాథం.

"అదేమిటో తెలియాలంటే, నన్ను గురించి సంక్షిప్తంగా, నేను చెప్పేదంతా వినండి..."

విశ్వనాథం విస్మయంగా చూస్తూ కూర్చున్నాడు.

జగన్నాథం తన హృదయభారాన్ని దింపుకోటం మొదలెట్టాడు.

"ఏ పూట కా పూట నాన్న రెక్కలకష్టం మీద సాగే సంసారం మాది. మా అమ్మ, ఆ వీధి ఆడవాళ్లందరి బట్టలూ మిషన్ మీద కుట్టి మరికొంత సంపాదించి, గుట్టుగా కాపురాన్ని వెళ్ళదీసేది. నేనొక్కణ్ణే సంతానం కావటంవల్ల, అంత బీదరికంలోనూ, అరచేతులో పెట్టుకు పెంచారు నన్ను మా అమ్మా, నాన్నలు! నాన్న ఉద్దేశ్యంలో, తన రక్తపుబొట్లు చిందించి అయినా, నన్ను పెద్ద చదువులు చదివించి, పెద్ద ఆఫీసర్ని చెయ్యాలని వుండేది. అమ్మకూ ఆ కోరిక ఉండటంలో ఆశ్చర్యం లేదు. బిడ్డల ఉన్నతికంటే తల్లి కోరే దేముంటుంది కనుక!

కానీ నా కలాంటి అభిప్రాయాలేం లేవు. "తిను, త్రాగు, సుఖించు!" అనే సిద్ధాంతాన్ని జీర్ణింపజేసుకున్న నేను ఫోర్తు ఫారం మూడుమార్లు దండయాత్ర చేశాను. అప్పటికే వయసు ఇరవై దాటింది. నన్ను ప్రయోజకుణ్ణి జేద్దామనే ప్రయత్నంలో నాన్న నిజంగానే తన రక్తం ధారపోశాడు. ఫలితం గుండె జబ్బుతో మరణించాడు. అమ్మా, నేనూ మిగిలాం. నాన్నపోయిన దిగులూ, నా గురించిన బెంగా, కలసి అమ్మను జీవచ్ఛవంలా తయారుచేశాయి! మిషన్ తొక్కలేకపోతోంది. ఇక భోజనం మాట? షోకులతో నాజూకుగా పెరిగిన శరీరం కాయకష్టానికి 'ససేమిరా' అంటోంది. ఫోర్తుఫారం ఫెయిలైన

నాకు ఏ క్వాలిఫికేషన్ చూచి ఉద్యోగమిస్తారు? అన్నిటికంటే ముఖ్యంగా జులాయిగా పెరిగిన నాకు ఏ పనీ చెయ్యాలనే కోరికా, బాధ్యతా కూడా లేకుండా పోయాయి! కానీ దారిద్ర్యం తాండవిస్తోంది. రెండురోజుల కోసారి భోజనం ప్రాప్తిస్తోంది. ఆకలి బాధంటే ఏమిటో అర్థమయ్యింది. కానీ ఏది దారి?

ఆ సమయంలో ఓ మిత్రుడి సలహా నచ్చింది. మెల్లిగా ఆ మార్గాన బయల్దేరాను. కానీ బెడిసికొట్టింది. ఓ పెద్దమనిషి పర్సు కొట్టేస్తూ పట్టుబడ్డాను. మరోసారి మరో ఆసామీ సూట్ కేస్ లాగేస్తూ చిక్కుపడ్డాను. అనుభవం తక్కువ. భయం ఎక్కువ. రెండూ కలిసి రెండుమార్లు జైలును చూపించాయి.

ఇంటికి రాగానే అమ్మ భోరున ఏడ్చింది, "భుక్తి కీనాడు లోటయినా, నీతిగల కుటుంబంలో పుట్టాను, మెట్టాను. నా ఖర్మ! నీ లాటి కొడుకు పుడతాడని తెలిస్తే, కడుపుతో వున్నప్పుడే ఏదేనా తిని చచ్చేదాన్నిరా!" అంటూ.

అమ్మ ఆకారం జూచి కలవరపడ్డాను. అస్థిపంజరం మాత్రమే అమ్మ రూపంలో ఉంది.

"జగ్గూ! నాయనా! నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. అవన్నీ బుగ్గిపాలయిపోతే పోనీ! కానీ రెక్కల కష్టం చేస్తే తప్పు లేదు. కానీ యిలా దొంగతనాలు...ఛ... ఛ...ఒద్దు నాయనా! ఆ పాపపు సొమ్ము తిన్నా జీర్ణం కాదు నాయనా! ఒక్క మాటివ్వరా! నీతిగా నిజాయితీగా యికనైనా బ్రతుకుతానని ఒక్కసారి ప్రమాణం చెయ్యరా జగ్గూ!"

అమ్మ చెప్పే వేవీ నా చెవి కెక్కలేదు. కేవలం ఆమెను తృప్తిపరచటానికి మాత్రం చేతిలో చేయి వేశాను అంతే!

సాయంత్రం అలవాటు ప్రకారం బయల్దేరాను. పాప కన్పించింది. నాలోని ఏ రాక్షసశక్తో ప్రేరేపించింది. పాపను చంపుదామన్న ఉద్దేశ్యం నాకు లేదు. ఒక్క నగలను మాత్రమే హరించాలనుకున్నాను. కానీ పాప ప్రవర్తనలోని అమాయకత్వం, ఆ పసిపాప స్వచ్ఛమైన మాటలలోని ఏ దివ్యశక్తో నన్ను మేల్కొలిపింది! తనంత తానుగా నమ్మి నాతో వచ్చింది పాప! గాజు లెలా తీయాలో చెప్పింది పాప! ఆ నిర్మల హృదయంలోని నిర్మలత్వానికి నాలో ఉన్న దానవత్వం సూర్యకిరణాల తాకిడికి మంచుతెరగా విడిపోయింది! ఒక్క సారిగా నన్ను గురించి నేను ఆలోచించుకున్నాను. నా నికృష్టపు జీవితంలోని మాలిన్యాన్ని గ్రహించాను. పాపను తెచ్చాను. కాని మీరు నాయందు చూపిస్తున్న దయకు మరింతగా క్రుంగిపోయాను...

విశ్వనాథంగారూ! ఏదీ దాచలేదు ... జరిగిందిది ... ఇవిగో సొమ్ములు."

జగన్నాథం నగలన్నీ టీపాయ్‌మీదుంచాడు.

విశ్వనాథం విస్మయంగా చూస్తున్నాడు.

జగన్నాథం చిన్నగా నవ్వాడు. "విశ్వనాథంగారూ! ఇక మీ యిష్టం...నన్నేమైనా చెయ్యండి...మీరు విధించే శిక్ష ఎలాంటిదైనా సిద్ధంగా వున్నాను ... అంతటితో గానీ నాకు నిష్కృతి లభించదు..." నిశ్చింతగా కళ్లు మూసుకున్నాడు

జగన్నాథం. మనస్సెంతో తేలికగా నిర్మలంగా వుందిప్పుడు ! బహుశా తనను ఏ రివాల్వర్ తోనో, కాల్చివేస్తాడు విశ్వనాథం. లేదా ఫోనులో పోలీస్ స్టేషన్‌కు కబురు చేస్తాడు. కానీ ఏం చేసినా ఫర్వాలేదు ... ఊహాగానాలు చేస్తున్న జగన్నాథం ఉలిక్కిపడ్డాడు. విశ్వనాథం తన రెండు బాహువులతో తనను కౌగలించు కుంటున్నాడు! కళ్ళు తెరచి ఆశ్చర్యపోయాడు జగన్నాథం.

"జగన్నాథం ... ఏం చేస్తానయ్యా నిన్ను ? ఏమి చెయ్యను ! ఇంతగా పరివర్తన చెందిన నీ కింకా శిక్షా ? ఎంత పిచ్చివాడివి జగన్నాథం! పాపానికి పశ్చాత్తాపానికి మించిన నిష్కృతేముందయ్యా ? నీకు నా కంపెనీలో వాటా ఇస్తాను. కష్టించి పనిచెయ్యి..."

జగన్నాథం తనేం వింటున్నాడో నసే భ్రమ కూడా కల్గుతోంది !

"ఈ నిముషం నుంచీ మనం ప్రాణస్నేహితులం జగం ! కాదనకు ! అలా చూస్తావేం నమ్మనట్లు ? నిజంగానే చెబుతున్నాను. తప్పులు మానవులుకాక మానులు చేస్తాయటయ్యా జగం ? మానవునిలోనే, దానవుడూ, దేవుడూ కూడా దాగి వున్నారయ్యా ! ఒక్కోసారా దానవుడు విజృంభించి మానవత్వాన్ని మంటకలుపుతాడు. మరోసారా మానవుడే దేవునిలా మారి అద్భుత కార్యాలు చేస్తాడు. మానవుడిలో దాగి వున్న యీ రెండు రూపాలూ, రెండు ఆకృతి లేని ఆలోచనలే అతని జీవితాన్ని మలుపులు తిప్పే చుక్కానిలాటివి !"

తన బాహువులతో చుట్టి, అల్లాగే చెబుతున్నాడు విశ్వనాథం ఇంకా! జగన్నాధం తెప్పరిల్లాడు...

"విశ్వం! ఈ సంతోషంతో మాటలు తోచటం లేదు నాకు ...... ఒక్కటి మాత్రం చెప్పగలను ...... నాలాటి నీచుణ్ణి క్షమించ గలిగిన నువ్వు, మానవుడివి కాదయ్యా! దేవుడివి!" అని మాత్రం అనగలిగాడు.

"కాదు...కాదు...నేనూ నీలాటి మానవుణ్ణే!" విశ్వనాథం నిండుగా నవ్వాడు.

"భోజనానికి రాండి నాన్నా! మామయ్యా. నువ్వు కూడా!" అంటూ వచ్చిన పాపను ఎత్తుకున్నాడు జగన్నాధం!

"విశ్వం! ఈ రోజునుంచీ పాప నీకేకాదు, నాక్కూడా పాపే! నన్ను గాఢాంధకారం నుంచి బయటికి - వెలుగులోకి తెచ్చిన బంగారు పాప! నాలోని దానవత్వాన్ని సమూలంగా నాశనంచేసి, నన్ను మానవుడిగా మార్చిన నా కంటిపాప!"

పాప బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపిస్తున్న జగన్నాధాన్ని చూస్తూ, అతని మాటలు బోధపడక, అప్పుడే గది గుమ్మం దగ్గర కొచ్చిన పార్వతి చకితురాలై చూస్తోంది!